
సాక్షి
వికారాబాద్
శుక్రవారం । 13 । అక్టోబర్ । 2023





## రూ.9.30 లక్షలు పట్టివేత

పట్టణంలోని పలు చోట్ల తనిఖీలు చేపట్టిన పోలీసులు పలువురి నుంచి రూ. 9.30 లక్షలు సీజ్ చేశారు. 10లో▸



## శనైశ్చర ఆలయం ముస్తాబు

మోమిన్‌పేట సమీపంలో కొలువుదీరిన శనైశ్చర స్వామి శనివారం నుంచి ప్రత్యేక పూజలు అందుకోనున్నారు. 10లో▸



## ప్రభుత్వాన్ని సాగనంపుదాం

'రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ అవినీతి పాలనను సాగనంపుదామని కాంగ్రెస్ నేతలు నినదించారు. 11లో▸

### న్యూస్‌రీల్

## పాపం కాశమ్మ..

### పింఛన్ పునరుద్ధరించాలని వేడుకుంటున్న వృద్ధురాలు



పింఛను కోసం మున్సిపల్ కార్యాలయం వద్ద నిరీక్షిస్తున్న కాశమ్మ

**తాండూరు టౌన్:** ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన విషయం కూడా తెలియని ఓ వృద్ధురాలు మూడు రోజులుగా పింఛన్‌ను పునరుద్ధరించాలంటూ మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరుగుతోంది. రోజూ గంటల తరబడి కార్యాలయం వద్ద వేచి చూస్తున్నా సరైన సమాధానం చెప్పేవారు కరువయ్యారు. కనిపించిన ప్రతి అధికారిని కలుస్తూ తన పింఛన్ ఎందుకు ఆగిందో చెప్పాలని కోరుతోంది. పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన వడ్డే కాశమ్మ, ఆమె భర్తకు పింఛన్ వచ్చేది. మూడేళ్ల క్రితం భర్త చనిపోయాడు. మున్సిపల్ కార్యాలయంలో భర్త డెత్ సర్టిఫికెట్ అందజేసింది. ఆ నెల నుంచి కాశమ్మ పింఛను కూడా ఆగిపోయింది. దీంతో కాశమ్మ మూడేళ్లుగా మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరుగుతోంది.

## 15 తాండూరులో అథ్లెటిక్స్ పోటీలు

**తాండూరు టౌన్:** వికారాబాద్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 15న అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.మధు, సహాయ కార్యదర్శి ఎం.రాము గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. తాండూరు పట్టణంలోని పాత శాలివాహన మైదానంలో జిల్లా స్థాయి అండర్ 14, 16, 18, 20 పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో రన్నింగ్, లాంగ్‌జంప్, షాట్‌పుట్ తదితర పోటీలు ఉంటాయని తెలిపారు. ఇందులో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు ఈనెల 25న సూర్యాపేటలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఎస్సెస్సీ మెమో లేదా జనన ధ్రువీకరణ పత్రాలు తీసుకుని, ఉదయం 9గంటలకు హాజరు కావాలని, వివరాలకు సెల్: 9912328142, 8978234447 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## జవాబుదారీగా పని చేద్దాం

### అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్




మాట్లాడుతున్న లింగ్యానాయక్

**కొడంగల్:** రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అధికారులు పారదర్శకంగా, జవాబుదారీగా పని చేయాలని అడిషనల్ కలెక్టర్ లింగ్యా నాయక్ సూచించారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ కళాశాల ఆవరణలో సెక్టోరియల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల అధికారులు వారి బాధ్యతలను విస్మరించరాదన్నారు. ఉన్నతాధికారుల దృష్టి కొడంగల్‌పైనే ఉంటుందన్నారు. రాజకీయ పార్టీలకు అనుకూలంగా కానీ వ్యతిరేకంగా కానీ పని చేయరాదని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు విజయకుమార్, వెంకటేశ్ పాల్గొన్నారు.

## ఎస్టిమేషన్ లేని పనులపై విచారణకు ఆదేశం

సాక్షి ఎఫెక్ట్..

**పరిగి:** పరిగి విద్యుత్ శాఖలో ఎస్టిమేషన్లు లేకుండా చేసిన పనులపై గురువారం సాక్షి దినపత్రికలో అంతా మా ఇష్టం అనే శీర్షికన ప్రచురితమైన వార్తకు ఉన్నతాధికారులు స్పందించారు. విచారణ చేపట్టాలని ఏఈ ఖాజాను ఆదేశించారు. దీంతో ఆయన న్యామత్ నగర్‌లో ఫాం హౌస్‌ను సందర్శించారు. ఎస్టిమేషన్లు లేకుండా విద్యుత్ స్తంభాలు, కనెక్షన్ ఇచ్చినట్లు గుర్తించారు. విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్టిమేషన్ లేకుండా పనులు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. న్యామత్ నగర్‌లో ఫాం హౌస్ విద్యుత్ పనులపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని ఆయన తెలిపారు.

# బుజ్జగింపుల పర్వం

- అసమ్మతి నేతల ఇళ్లకు ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్
- మచ్చిక చేసుకునే పనిలో బీఆర్‌ఎస్ అభ్యర్థి
- ఇప్పటికే 'కారు' దిగిన పలువురు నాయకులు
- 16న కాంగ్రెస్‌లో చేరనున్న మరికొందరు



**వికారాబాద్ అర్బన్:** వికారాబాద్ నియోజకవర్గ రాజకీయం ఇప్పుడిప్పుడే వేడెక్కుతోంది. అధికార, ప్రతిపక్ష అభ్యర్థులు ముందుగా ఇల్లు చక్కదిద్దుకొని బయటకు వచ్చే ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ప్రధానంగా వికారాబాద్ బీఆర్‌ఎస్‌లో అసమ్మతి రాగం బలంగా ఉంది. పార్టీ ఆవిర్భావం నుంచి పని చేసిన చాలా మంది నాయకులను ఆనంద్ ఎమ్మెల్యేగా గెలిచాక దూరం పెడుతూ వచ్చారు. పార్టీపై అభిమానం ఉన్నా ఆనంద్‌పై ప్రేమ లేదని చెబుతున్నారు. ఈ ఎన్నికల్లో ఆనంద్‌కు బదులుగా మరొకరికి టికెట్ ఇవ్వాలని అనేక సార్లు సమావేశాలు పెట్టి తమ మనస్సులోని మాటను చెప్పారు. అయితే అసమ్మతి నాయకులను ఎలాగైనా మచ్చిక చేసుకోవాలనే ఆలోచన ఉన్న ఎమ్మెల్యే ఆనంద్ ఆ దిశగా పావులు కదుపుతున్నారు. ఇందులో భాగంగా వారిని బుజ్జగించే కార్యక్రమం మొదలు పెట్టారు. ఈ విషయం బయటికి పొక్కకుండా జాగ్రత్త పడుతున్నారు. పది రోజులుగా ఎమ్మెల్యే ఒంటరిగా అసమ్మతి నాయకుల ఇళ్లకు వెళ్లి వారితో చర్చిస్తున్నారు. ఎప్పుడు.. ఎలా.. ఎవరి ఇంటికి వెళుతున్నారనే విషయం పక్కనే ఉండే సహాయకులకు కూడా తెలియకుండా జాగ్రత్త పడుతున్నారు.

**సీనియర్లను దూరం పెట్టడంతోనే..**

2018 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచిన ఆనంద్ ఆ తర్వాత పార్టీలోని కొందరు సీనియర్ నాయకులను దూరం పెడుతూ వచ్చారు. నాలుగేళ్లుగా ఇదే తరహా రాజకీయం నడిచింది. దీంతో సీనియర్లు, ఎమ్మెల్యే మధ్య గ్యాప్ పెరుగుతూ వచ్చింది. కొన్నాళ్లుగా చాలా మంది నాయకులు పార్టీలోనే ఉంటూ ఆనంద్‌కు వ్యతిరేకంగా గళం విప్పారు. కావాలనే ఎమ్మెల్యే తమపై పోలీసు కేసులు పెట్టించారని ఆరోపించారు. దళిత బంధు పథకాన్ని ఎమ్మెల్యే తన బంధువులకే ఇచ్చారని సొంత పార్టీ నాయకులే విమర్శించారు. అయితే ఎన్ని ఆరోపణలు చేసినా అసమ్మతి నేతలపై ఎమ్మెల్యే ఎక్కడా నోరు జారలేదు. అధిష్టానం అండదండలు ఉండడంతో ఊరూరు తిరుగుతూ ప్రజల్లో ఉండే ప్రయత్నం చేశారు. అసమ్మతి నాయకులతో ముప్పు తప్పదని భావించిన ఎమ్మెల్యే నష్ట నివారణ చర్యలకు దిగారు.

**కారు దిగుతున్న నేతలు**

బీఆర్‌ఎస్ నాయకులు ఒక్కొక్కరుగా కాంగ్రెస్ గూటికి చేరుతున్నారు. ఇప్పటికే వికారాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాంచంద్రారెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. ఈ నెల 16న జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కొండల్ రెడ్డి, ధారూరు మండల సీనియర్ నాయకుడు, ఎంపీపీ భర్త హన్మంత్ రెడ్డి, వికారాబాద్ మాజీ జెడ్పీటీసీ ముక్తార్ షరీఫ్ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకునేందుకు సిద్ధమయ్యారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల భర్త రమేష్ కుమార్ కూడా ఎమ్మెల్యేపై గుర్రుగా ఉన్నారు. మంజులను అనేక రకాలుగా ఇబ్బందులకు గురి చేశాడని ఎమ్మెల్యేపై విమర్శలు గుప్పించిన విషయం తెలిసిందే. రమేష్ కుమార్ పార్టీ వీడకపోయినా ఎమ్మెల్యే గెలుపునకు సహకరిస్తారా అనే అనుమానం లేకపోలేదు. ఈ నెల 16న పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి వికారాబాద్ పర్యటన సందర్భంగా పలువురు బీఆర్‌ఎస్ అసమ్మతి నేతలు కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు.

### రంగంలోకి ఎంపీ రంజిత్‌రెడ్డి

ఎమ్మెల్యేపై సొంత పార్టీ నాయకుల్లోనే వ్యతిరేకత ఉన్న విషయం తెలుసుకున్న ఎంపీ రంజిత్ రెడ్డి ఆనంద్‌తో కలసి నష్ట నివారణ చర్యలకు దిగారు. కోడ్ అమల్లోకి వచ్చిన మరుసటి రోజే ఎమ్మెల్యే, ఎంపీ అసమ్మతి నాయకులను బుజ్జగించే పనిలో పడ్డారు. పార్టీ ముఖ్య నాయకులతో రహస్య సమావేశం నిర్వహించారు. ద్వితీయ శ్రేణి నాయకులు చేజారి పోకుండా వారితో మంతనాలు జరుపుతున్నారు. తన వల్ల ఎవరికైనా ఇబ్బంది కలిగి ఉంటే క్షమించాలని, తనకు రాజకీయాలు కొత్త కావడంతో చిన్నచిన్న పొరపాట్లు జరిగి ఉండవచ్చని, వాటిని మనస్సులో పెట్టుకోరాదని కోరినట్లు తెలిసింది. తన గెలుపునకు పూర్తిగా సహకరించాలని కోరినట్లు సమాచారం. తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా వ్యవహరించిన శుభప్రద్‌పటేల్ 2018 ఎన్నికల్లో ఆనంద్ గెలుపునకు కృషి చేశారు. ఆ తరువాత శుభప్రద్ పటేల్ ఎమ్మెల్యేకు పూర్తిగా దూరమయ్యారు. బీసీ కమిషన్ సభ్యుడిగా కేవలం తన పరిధిలోని కార్యక్రమాలకే హాజరవుతూ.. ఎమ్మెల్యే కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వచ్చారు. పది రోజుల క్రితం ఎమ్మెల్యే ఆనంద్ నేరుగా శుభప్రద్ పటేల్ ఇంటికి వెళ్లి చాలా సేపు మాట్లాడారు. అదేవిధంగా ధారూరు మండలం సీనియర్ నాయకుడు హన్మంత్ రెడ్డి నివాసానికి వెళ్లారు. ఆయన అందుబాటులో లేకపోవడంతో కలవలేకపోయినట్లు తెలిసింది. దళిత బంధు అమలుపై తీవ్ర ఆరోపణలు చేసిన భూమోళ్ల కృష్ణయ్యను సైతం ఎమ్మెల్యే కలిసే ప్రయత్నం చేస్తున్నా అతను కలవడం లేదని ప్రచారం జరుగుతోంది. ఇన్నాళ్లు బీఆర్‌ఎస్ టికెట్ ఆశించిన పార్టీ సీనియర్ నాయకుడు వడ్ల నందు రెండు రోజుల క్రితం ఎంపీ రంజిత్‌రెడ్డి జోక్యంతో మెత్తబడ్డారు. ఎంపీ, ఎమ్మెల్యేతో కలసి ఇటీవల మంత్రి కేటీఆర్‌ను కలిశారు. పార్టీ ప్రకటించిన అభ్యర్థి విజయానికి కృషి చేయాలని కేటీఆర్.. నందుకు సూచించినట్లు సమాచారం.



సునితాసంపత్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రేవంత్‌రెడ్డి

# కాంగ్రెస్‌లోకి వలసలు

- బీఆర్‌ఎస్‌ను వీడిన పలువురు నేతలు, ప్రజాప్రతినిధులు
- రేవంత్‌రెడ్డి సమక్షంలో హస్తం పార్టీలో చేరిక

**తాండూరు:** నియోజకవర్గానికి చెందిన బీఆర్‌ఎస్ నేతలు గురువారం డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ సునితాసంపత్, డీసీసీబీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి తనయుడు మహిపాల్‌రెడ్డి, పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు గాంధీభవన్‌లో పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. తాండూరులో కాంగ్రెస్ పార్టీని మరోసారి గెలిపించాలని నాయకులకు రేవంత్‌రెడ్డి సూచించారు. ఈ సందర్భంగా మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు కృషి చేస్తామన్నారు. జిల్లాలోని అన్ని అసెంబ్లీ స్థానాలు కాంగ్రెస్ ఖాతాలో చేరడం ఖాయమన్నారు. అనంతరం మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సునితాసంపత్ మాట్లాడుతూ.. డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి కాంగ్రెస్‌లోకి రావడం బలం చేకూరిందని తెలిపారు.

**కాంగ్రెస్‌లో చేరిన సర్పంచులు**

**తాండూరు రూరల్:** బీఆర్‌ఎస్‌కు చెందిన నలుగురు సర్పంచులు గురువారం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారు. మండలంలోని గుంతబాసుపల్లి సర్పంచ్ జగదీష్, గుండ్లమడుగు తండా సర్పంచ్ దశరథ్, చంద్రవంచ సర్పంచ్ శ్రీదేవి, ఆమె భర్త విజయ్‌కుమార్, వీరారెడ్డిపల్లి సర్పంచ్ అనూష, ఆమె భర్త శ్రీనివాస్ కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అశోక్‌కుమార్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

**కాంగ్రెస్‌లోకి మైపాల్‌రెడ్డి**

**పెద్దేముల్:** బీఆర్‌ఎస్ సీనియర్ నేత, డీసీసీబీ మాజీ చైర్మన్ రుద్రారం లక్ష్మారెడ్డి కుమారుడు మైపాల్‌రెడ్డి గురువారం రేవంత్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి, మాజీ మంత్రి గడ్డం ప్రసాద్, డాక్టర్ సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

**కాంగ్రెస్ గూటికి పీఏసీఎస్ చైర్మన్**

**పరిగి:** మాజీ మంత్రి కమతం రాంరెడ్డి తనయుడు, గండీడ్ పీఏసీఎస్ చైర్మన్ కమతం శ్రీనివాస్‌రెడ్డి పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేయాలని రేవంత్‌రెడ్డి సూచించినట్లు తెలిపారు. పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, పరిగిలో కాంగ్రెస్ జెండా ఎగరాలని సూచించినట్లు తెలిపారు.కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్‌కు కొండల్‌రెడ్డి రాజీనామా



**మర్పల్లి:** గ్రంథాయ సంస్థ మాజీ చైర్మన్ సనగారి కొండల్‌రెడ్డి గురువారం బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేశారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు తన రాజీనామా లేఖ పంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ కోసం ఎంతో శ్రమించానని తెలిపారు. అయితే తనకు గానీ తన అనుచరులకు గానీ ఎలాంటి గుర్తింపు లభించలేదన్నారు. ఈ కారణంగానే రాజీనామా చేసినట్లు తెలిపారు. తనను అన్ని విధాలా ఇబ్బందులకు గురి చేస్తున్న ఎమ్మెల్యే ఆనంద్‌ను ఓడించడమే లక్ష్యమన్నారు. బీఆర్‌ఎస్ పేదల సంక్షేమాన్ని వదిలేసిందన్నారు. ఆ పార్టీకి భవిష్యత్ లేదని పేర్కొన్నారు. త్వరలో కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు కొండల్‌రెడ్డి స్పష్టం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రంజిత్‌రెడ్డి

# బీఆర్‌ఎస్ మేనిఫెస్టో వస్తే..

### ప్రతిపక్షాల నోర్లు బంద్

- ఎమ్మెల్యే ఆనంద్‌ను మరోసారి ఆశీర్వదించాలి
- ఎంపీ రంజిత్‌రెడ్డి
- వికారాబాద్‌లో పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం

**అనంతగిరి:** సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టే మేనిఫెస్టో అన్ని వర్గాలకు ఆమోదయోగ్యంగా ఉంటుందని, దీంతో ప్రతిపక్షాల నోర్లు బంద్ కావడం ఖాయమని ఎంపీ రంజిత్‌రెడ్డి అన్నారు. గురువారం వికారాబాద్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వికారాబాద్ అభివృద్ధి బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ ఘన విజయం సాధిస్తుందని, కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం అవుతారని ధీమా వ్యక్తం చేశారు. దేశంలో ఎక్కడా తెలంగాణ తరహా పథకాలు అమలు కావడం లేదన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్‌ను మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మరోసారి ప్రజలు తనను ఆశీర్వదించాలని కోరారు. నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. సమావేశంలో రైతుబంధు జిల్లా అధ్యక్షుడు రాంరెడ్డి, నాయకులు నందు, పీఏసీఎస్ చైర్మన్ ముత్యంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దీప, వైస్ చైర్మన్ శేఖర్‌రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కమల్‌రెడ్డి, కౌన్సిలర్లు గోపాల్, అనంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శివారు.. బేజారు..!

- మున్సిపాలిటీలో విలీనమైనా అభివృద్ధి చెందని వార్డులు
- రోడ్లపైనే మురుగు
- ఇబ్బందిగా మారిన రైల్వే అండర్ పాస్ బ్రిడ్జిలు
- పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు శూన్యం
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందుల్లో శివారు కాలనీల ప్రజలు



లక్ష్మీనగర్ తండాలో మంచినీటి ట్యాంక్ వద్ద నిలిచిన మురుగు

**వికారాబాద్ అర్బన్:** తమ గ్రామం మున్సిపాలిటీలో కలిస్తే వార్డుగా మారి అభివృద్ధి చెందుతుందని విలీన గ్రామాల ప్రజలు ఆశించారు. నాలుగేళ్ల క్రితం పలు గ్రామాలు వికారాబాద్ మున్సిపాలిటీలో విలీనమయ్యాయి. అయినా అభివృద్ధి జరగకపోవడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు శివారు వార్డుల అభివృద్ధిపై శ్రద్ధ వహించడం లేదనే విమర్శలు ఉన్నాయి. పట్టణ ప్రధాన ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తుండగా శివారు ప్రాంతాల్లో విస్మరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

**చెత్త సేకరణకు ఆటో రాదు**

శివారు వార్డుల్లో చెత్త సేకరించడంలో మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. పట్టణ ప్రధాన వీధుల్లో చూపే శ్రద్ధ శివారు ప్రాంతాల్లో చూపడం లేదని స్థానికులు అంటున్నారు. విలీన గ్రామాల్లో రెండు మూడు రోజులకు ఒక్క సారి చెత్త సేకరిస్తున్నారు. కాలువల్లో వ్యర్థాలు తీయడం లేదు. పండుగలు, శుభకార్యాలు ఉంటే తప్ప రోడ్లను శుభ్రం చేయడం లేదు. పట్టణానికి 9కిలో మీటర్ల దూరంలో ఉన్న శివారు కాలనీల నుంచి చెత్త సేకరించడం మున్సిపల్ సిబ్బందికి సమస్యగా మారింది.

**రైల్వే బ్రిడ్జిలతో ఆటంకం**

మున్సిపల్ పరిధిలోని గెరిగెట్‌పల్లి, బూర్గుపల్లి వార్డుల అభివృద్ధికి రైల్వే బ్రిడ్జిలు సమస్యగా మారాయి. ఈ రెండు వార్డులకు వెళ్లాలంటే రైల్వే అండర్ పాస్ బ్రిడ్జిలు దాటాలి. దీంతో మున్సిపల్ కార్మికులు కొన్ని సార్లు వెళ్లలేకపోతున్నారు. పైగా బూర్గుపల్లి రోడ్డు పూర్తిగా దెబ్బతింది. అడుగడుగునా గుంతలు ఉండడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మున్సిపాలిటీలో విలీనమైనా రోడ్లు బాగుపడలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**యూజీడీ నిర్మించాలని డిమాండ్**

మున్సిపాలిటీలో విలీనమైన ప్రతి వార్డులో డ్రైనేజీ సమస్య ఉంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నాలుగేళ్ల క్రితం వరకు పంచాయతీ పరిధిలో ఉన్న కాలనీలు.. నిధులు లేక మురుగు కాలువలు నిర్మించలేదు. ప్రస్తుతం మున్సిపాలిటీలో విలీనమైనా పరిస్థితిలో మార్పు లేదని ప్రజలు అంటున్నారు. వార్డుల అభివృద్ధికి అరకొర నిధులు కేటాయిస్తున్నారని, దీంతో సమస్యలు తీరడం లేదన్నారు. వీధులు ఇరుకుగా ఉండటం ఒక సమస్య అయితే.. మురుగు రోడ్డుపై పారడం మరో సమస్యగా మారింది. శివారు వార్డుల్లో కూడా అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు నిర్మించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. మున్సిపల్ పరిధిలోని 2వ వార్డు ధన్నారంలో చాలా కాలం క్రితం నిర్మించిన మురుగు కాలువ వ్యర్థాలతో కూరుకుపోయింది. దీంతో మురుగు పైకి వస్తోంది. పక్కనే ఉన్న గృహాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గెరిగెట్‌పల్లి 10వ వార్డులో ప్రధాన రోడ్డు పక్కనే మురుగు కాలువ ఉండటంతో వార్డు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మద్గుల్ చిట్టంపల్లి, గుడుపల్లి, బూర్గుపల్లిలో మురుగు కాలువల సమస్య తీవ్రంగా ఉంది.

### మెరుగు పడాలి



విలీన గ్రామాల ప్రజలకు ఇంకా మున్సిపాలిటీలో కలసిన ఫీలింగ్ లేదు. చెత్త సేకరణ సక్రమంగా జరగాలి. వాహనాల సంఖ్యను కూడా పెంచాలి. నిత్యం మురుగు కాలువలను శుభ్రం చేయాలి. ధన్నారంలోని మురుగు కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించడం లేదు.

– ముస్తఫా, ధన్నారం

### దెబ్బతిన్న రోడ్డు



వికారాబాద్ – బూర్గుపల్లి రోడ్డు పూర్తిగా దెబ్బతింది. అడుగడుగునా గుంతలు పడ్డాయి. రాత్రి వేళ రాకపోకలకు కష్టంగా ఉంది. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రోడ్డును తక్షణం బాగుచేయాలి. అలాగే కాలనీ అభివృద్ధికి నిధులు విడుదల చేయాలి.

– రమేష్, 9వ వార్డు

## ఆ ఆస్తులను ఎవరు కొన్నా చెల్లవు

**శంకర్‌పల్లి:** కోర్టు ఆధీనంలో ఉన్న శంకర్‌పల్లి వీరభద్రీయ పరపతి సంఘం ఆస్తులను ఎవరు కొనుగోలు చేసినా చట్టపరంగా చెల్లవని సీఐడీ ఏసీపీ రాములు తెలిపారు. గతంలో కోర్టు ఆధీనంలో ఉన్న వీర భద్రీయ సంఘం భవనం, సంఘంలో సభ్యుల ఇళ్లకు, ఖాళీ ప్లాట్లకు శంకర్‌పల్లి పోలీసుల ఆధ్వర్యంలో గురువారం బోర్డులను ఏర్పాటు చేశారు. ఇళ్ల యజమానులకు నోటీసులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శంకర్‌పల్లి పట్టణ కేంద్రంలోని వీరభద్రీయ సంఘం చిట్‌ఫండ్ కంపెనీ పేరుతో చిట్టీలు పెట్టడంతో పాటు పెద్ద ఎత్తున ప్రజల నుంచి డబ్బులను డిపాజిట్ చేసుకోవడం జరిగిందన్నారు. చిట్టీ డబ్బులతో పాటు, డిపాజిట్ డబ్బులను ఇవ్వకపోవడంతో బాధితులు 2018లో శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. పోలీసులు దర్యాప్తు చేసి కేసును సీఐడీకి అప్పగించినట్టు తెలిపారు. వీరభద్రీయ సంఘానికి సంబంధించిన 21 స్థిరాస్తులు (ఇళ్లు, ఖాళీ స్థలాలు), 21 చరాస్తులు అయిన బంగారం నగలు, వాహనాలను సీజ్ చేయడం జరిగిందన్నారు. వీరభద్రీయ సంఘంలో సుమారు 2000 మంది బాధితులు ఉండగా వారిని సుమారు 60కోట్లకు పైగా మోసం చేసినట్లు గుర్తుంచామని అన్నారు. సంఘానికి సంబంధించి మొత్తం 82 మందిపై కేసు నమోదు చేసి 78 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందని చెప్పారు. నలుగురు మాత్రం ఇతర దేశాల్లో ఉన్నారని వారికి కూడా నోటీసులు పంపడం జరిగిందన్నారు. వీరభద్రీయ సంఘం ఆస్తులన్నీ ఎల్‌బీ నగర్ కోర్టు ఆధీనంలో ఉన్నాయని తెలిపారు.

## క్లుప్తంగా

### 'బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేస్తా'

ధారూరు: బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేయనున్నట్లు జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు జైదుపల్లి హన్మంత్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వ్యక్తిగత కారణాలతోనే పార్టీ మారాలని భావిస్తున్నట్లు తెలిపారు. ఏ పార్టీలో చేరాలనే విషయమై త్వరలోనే స్పష్టత ఇస్తానని పేర్కొన్నారు.

### సీట్లు ఖాళీ



జిల్లా గ్రంథాలయంలో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

వికారాబాద్ అర్బన్: ఎన్నికల కోడ్ నేపథ్యంలో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే నిరుద్యోగులు ఇంటి బాటపట్టారు. మరో రెండు మూడు నెలల వరకు ఎలాంటి పోటీ పరీక్షలు ఉండే అవకాశం లేకపోవడంతో చదువులకు కాస్త విరామం ఇచ్చారు. అభ్యర్థులతో ఎప్పుడూ నిండుగా కనిపించే జిల్లా గ్రంథాలయం ప్రస్తుతం వెలవెలబోతోంది. నవంబర్ 20వ తేదీ నుంచి టీఆర్టీ ప్రారంభం కావాల్సి ఉన్నా ఎన్నికల కారణంగా జరిగే అవకాశం లేదు. దీంతో అభ్యర్థులు సొంత పనుల్లో నిమగ్నమయ్యారు.

### తప్పుడు పోస్టులపై కఠిన చర్యలు



ఎస్పీ కోటిరెడ్డి

అనంతగిరి: సోషల్ మీడియాలో విద్వేషకర, రెచ్చగొట్టే తప్పుడు పోస్టులు పెట్టి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ కోటిరెడ్డి ఒక ప్రకటనలో హెచ్చరించారు. జిల్లా సోషల్ మీడియా యూనిట్ తరఫున నిరంతరం నిఘా పెట్టామన్నారు. ఎవరైనా ఇబ్బందికర పోస్టులు పెడితే షేర్, లైక్, ఫార్వర్డ్ చేయొద్దని, వారి వివరాలను డయల్ 100కు సమాచారం అందించాలని ఎస్పీ తెలిపారు.

### ఇసుక ట్రాక్టర్ పట్టివేత



అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్

పెద్దేముల్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను గురువారం పెద్దేముల్ పోలీసులు పట్టుకొని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. ఎస్‌ఐ కాశీనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దేముల్ మండల మంబాపూర్ నుంచి మారేపల్లి వైపు వెళ్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకొని తహసీల్దార్ కిషన్‌కు అప్పగించారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తీసుకోవడంతో పాటు, వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు.

### పేకాట రాయుళ్లపై కేసు



పోలీసుల అదుపులో నిందితులు

పెద్దేముల్: పేకాట ఆడుతున్న నలుగురిపై పోలీసులు కేసు నమోదు చేసిన ఘటన గురువారం పెద్దేముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ కాశీనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దేముల్ మండల బండమీదిపల్లి గ్రామానికి చెందిన బత్తిని నరేష్, రవి, శేఖర్, ఎల్లప్పలు పేకాట ఆడుతుండగా పట్టుకొని వారి నుంచి రూ.1840 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్‌ఐ తెలిపారు.

# రూ.9.30 లక్షలు పట్టివేత

- జోరుగా వాహనాల తనిఖీ
- పలు చోట్ల, నగదు, మద్యం పట్టివేత
- కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవంటున్న పోలీసులు



పోలీసులు పట్టుకున్న మద్యం



నగదుతో పట్టణ సీఐ రాజేందర్ రెడ్డి

తాండూరు టౌన్ : ఎన్నికల కోడ్ నేపథ్యంలో పట్టణంలోని పలు చోట్ల తనిఖీలు చేపట్టిన పోలీసులు ఇద్దరు వ్యక్తుల నుంచి రూ. 7.96 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. పట్టణానికి చెందిన కలాల్ మల్లయ్య వద్ద రూ. 5,46,620, పాండు చారి నుంచి రూ. 2.50 లక్షలు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ నగదును స్క్రీనింగ్ కమిటీ సభ్యులకు అందజేస్తామని, సరైన పత్రాలు సమర్పిస్తే తిరిగి ఇచ్చేస్తారని పట్టణ సీఐ రాజేందర్‌రెడ్డి తెలిపారు.

**రూ.74 వేల నగదు పట్టివేత**

యాలాల: పోలీసులు చేపట్టిన తనిఖీల్లో గురువారం రూ.74 వేల నగదును యాలాల పోలీసులు పట్టుకున్నారు. మండల కేంద్రంలోని బస్‌స్టేషన్ సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా దేవులా తండాకు చెందిన ఓ వ్యక్తి వద్ద రూ.74 వేల నగదును స్వాధీనం చేసుకుని, సీజ్ చేసినట్లు ఎస్‌ఐ అరవింద్‌కుమార్ తెలిపారు.

**రూ.60 వేలు**

తాండూరు రూరల్: మండలంలోని కోత్లాపూర్ గ్రామ శివారులోని తెలంగాణ–కర్ణాటక సరిహద్దు వద్ద గురువారం పోలీసులు తనిఖీలు చేపట్టారు. కర్ణాటక నుంచి కల్లూరు గ్రామానికి చెందిన విజయ్‌కుమార్ బైక్‌పై తాండూరుకు వస్తున్నాడు. బైక్‌ను తనిఖీ చేయగా అతని వద్ద ఉన్న రూ.60,600 నగదు స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

**మద్యం స్వాధీనం**

పెద్దేముల్: అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేసి, మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన పెద్దేముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ కాశీనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దేముల్ మండల ఆత్కూర్‌లో పరుమటి రాజు కిరాణ దుకాణంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడు. పోలీసులు దాడులు చేసి 96 మద్యం సీసాలు, 12బీరు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అతని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

# మద్దతు కోసం పాట్లు

- పోటాపోటీగా నారాయణరావును కలిసిన నేతలు
- ఉదయం కేఎల్ఆర్.. సాయంత్రం బీఎంఆర్
- మద్దతు ఇవ్వాలని కోరిన నేతలు



మాజీ ఎమ్మెల్యేను కలిసిన కేఎల్ఆర్



నారాయణరావు మద్దతు కోరుతున్న మనోహర్‌రెడ్డి తదితరులు

తాండూరు: నియోజకవర్గంలో బలమైన నేత మాజీ ఎమ్మెల్యే నారాయణరావును ప్రసన్నం చేసుకొనేందుకు రాజకీయ పార్టీల నేతలు పోటీ పడుతున్నారు. ఇప్పటికీ ఆయనకు పటిష్టమైన కేడర్ ఉంది. గురువారం తాండూరు– కాంగ్రెస్ పార్టీ టికెట్ ఆశిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి (కేఎల్ఆర్), డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి పోటాపోటీగా నారాయణరావును కలిశారు. ఉదయం తాండూరుకు చెందిన కాంగ్రెస్ నాయకులతో కలిసి కేఎల్ఆర్ ఆయన నివాసంలో భేటీ అయ్యారు. పార్టీ టికెట్ వస్తే మద్దతు ఇవ్వాలని కోరారు. అందుకు ఆయన సుముఖత వ్యక్తం చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపారు. మరోవైపు అదే రోజు సాయంత్రం డీసీసీబీ చైర్మన్ మనోహర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ సునీతాసంపత్, డాక్టర్ సంపత్‌కుమార్ మాజీ ఎమ్మెల్యేను కలిశారు. తాండూరులో అవినీతి పెరిగిపోయిందని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే అవినీతి అడ్డుకట్ట పడుతోందన్నారు. తాండూరులో తన గెలుపునకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. అందుకు ఆయన అంగీకరించినట్లు నేతలు తెలిపారు. ప్రస్తుతం నారాయణరావు బీఆర్ఎస్ పార్టీలో కొనసాగుతున్నారు. పక్షం రోజుల క్రితం ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి నారాయణరావును కలిసి మద్దతు కోరారు. ఈ విషయమై నారాయణరావును ఫోన్‌లో సంప్రదించగా తన మద్దతు కోసం పోటీలో ఉన్న నేతలు ఇంటికి వచ్చి వెళ్తున్నారని చెప్పారు. ఇంకా ఎవరికి మద్దతు ప్రకటించలేదని తెలిపారు.

# కాంగ్రెస్ పార్టీ చెప్పిందే చేస్తుంది..



ఇంటింటికి గ్యారంటీ కార్డులు పంపిణీ చేస్తున్న నాయకులు

కాంగ్రెస్ నాయకుడు విజయభాస్కర్‌రెడ్డి

ధారూరు: కాంగ్రెస్ పార్టీ హయాంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని నాగారంలో అన్ని వార్డుల్లో కాంగ్రెస్ నాయకులు తిరుగుతూ గ్యారంటీ కార్డుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన హామీలన్నీ బుట్టదాఖలయ్యాయని ఆరోపించారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న ప్రభుత్వం స్పందించడం లేదని, అవినీతి వల్లే గ్రూప్ 4 నుంచి వన్ వరకు రద్దయ్యే పరిస్థితి నెలకొందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఒక్కో గ్రామానికి ఏడాదికి కనీసం 100 ఇళ్లు వచ్చేవని, బీఆర్ఎస్ ప్రభుతం పదేళ్ల కాలంలో ఒక్క ఇల్లు మంజూరు చేసిన పాపాన పోలేదని మండిపడ్డారు. రైతుబంధును బూచిగా చూపుతూ వ్యవసాయ సబ్సిడీలు, ఉచిత విత్తనాలు పంపిణీ, సబ్సిడీపై అందించే వ్యవసాయ పనిముట్లు ఇవ్వకుండా రైతులకు అన్యాయం చేస్తున్నారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో నాగారం సర్పంచ్ కిరణ్ కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు అనంతయ్య, నాయకులు పాల్గొన్నారు.

# శనైశ్చరస్వామి ఆలయం ముస్తాబు

- రేపటి నుంచి శని అమావాస్య పూజలందుకోనున్న స్వామి
- కోరిన వారికి కొంగు బంగారం



ఏన్కతలలో శనైశ్చరస్వామి దేవాలయం

మోమిన్‌పేట: బంగారు పుష్పాలతో చేసే పూజలకన్న నల్ల నువ్వుల తైలంతో అభిషేకం, పూజలు చేస్తేనే శనైశ్చరస్వామికి ఎంతో ఇష్టమని, శని అమావాస్య, శని త్రయోదశి అంటే ఆ దేవునికి అమితమైన ప్రీతిప్రదమైన రోజులని భక్తుల నమ్మకం. శనైశ్వరస్వామి దేవాలయం రంగారెడ్డి జిల్లా, మోమిన్‌పేట మండల కేంద్రానికి ఆరు కిలోమీటర్ల దూరంలో హైదరాబాద్ వెళ్లే మార్గంలో ఎన్కతల గ్రామంలో కొలువై ఉంది. సప్త మందిరాలతో సప్త ఋషులు తపస్సు చేసిన ఈ పవిత్ర ప్రదేశం రాష్ట్రంలో రెండవ స్థానాన్ని ఆక్రమించింది. అలాగే, నర్మదామాత ఆలయం ఉండటం విశేషం.

**ఆలయ చరిత్ర..**

25 సంవత్సరాల కిందట ఎన్కతల గ్రామాన్ని సందర్శించిన స్వామిజీ శంకరభారతీ మహరాజ్ దట్టమైన చెట్లు, చేమలతో అటవీ ప్రాంతంగా ఉండే ఈ ప్రదేశంలో ఆశ్రమాన్ని నిర్మించుకున్నారు. స్వామిజీ సూచనల మేరకు స్థానికులు దేవాలయం నిర్మించి శనైశ్చరస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఇక్కడ ప్రభు, రామదాసు, మైబు సుభాన్ అనే మహర్షులు తపస్సు చేశారని చరిత్ర చెబుతోంది. స్వామిజీ చెప్పినట్టుగా ఇక్కడ శనైశ్చరస్వామి దేవాలయంతో పాటు మరో ఏడు మందిరాలు నిర్మించారు.

**గ్రహపీడ నివారణ కోసం..**

సంసార కలహాలతో, దారిద్ర్యంతో సతమతమవుతున్న, పనులు జరగక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారు, గ్రహదోషాలు ఉన్న వారు శనైశ్చరస్వామిని దర్శించుకుని ప్రత్యేక తైలాభిషేకం, పూజలు చేస్తే గ్రహపీడ నివారణ కలుగుతుందనేది భక్తుల ప్రగాఢ విశ్వాసం. శని అమావాస్య, శని త్రయోదశి రోజుల్లో శనైశ్చరస్వామికి తైలాభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహిస్తే స్వామి మేలు చేస్తాడని భక్తులు విశ్వసిస్తారు.

**సప్త వృక్షాల విశిష్టత...**

మొదటిది వేపచెట్టు ఆదిశక్తి రూపం, సకల సౌభాగ్య ప్రాప్తి, రెండవది జిల్లేడు చెట్టు గణపతి రూపం సర్వ మంగళ ప్రదం. మూడవది విష్ణు రావి చెట్టు విష్ణువు ఐశ్వర్య ప్రాప్తి, నాలుగోది శివరావి చెట్టు శివుడు అపమృత్యు నివారణ, ఐదోది మేడిచెట్టు దత్తత్రేయస్వామి దుష్టగ్రహ పీడ నివారణ, ఆరవది ఉసిరిక చెట్టు కృష్ణుడి రూపం భక్తి, జ్ఞాన, వైరాగ్య ప్రాప్తి, ఏడవది మారేడు చెట్టు, శివుని ప్రతిరూపం, శుభఫల సిద్ధి కలుగుతుందని భావిస్తారు.

**నర్మదామాత ఆలయం..**

దక్షిణ భారత దేశంలోనే ప్రథమంగా నర్మదామాత ఆలయం నిర్మించారు. మహేంద్రచేతన్ స్వామి చేతుల మీదుగా విగ్రహ ప్రతిష్ఠాపన జరిపారు. నవ గ్రహాల స్థాపన కూడా చేశారు. ఇక్కడికి వచ్చిన భక్తులు శనైశ్చరస్వామితో పాటు నర్మదామాతను దర్శించుకోవచ్చు.

**ఎలా వెళ్లాలి..**

హైదరాబాద్ నుంచి 65కిలో మీటర్లు. మోమిన్‌పేట మండల కేంద్రం నుంచి ఆరు కిలో మీటర్ల దూరంలో హైదరాబాద్ వెళ్లే మార్గంలో ఎన్కతలలో ఉంది. శనైశ్చర స్వామి దేవాలయం దర్శించడానికి ప్రతి రోజు బస్సు సౌకర్యం కలదు. భక్తుల సౌకర్యార్థం ఆలయ పాలక మండలి మంచినీటి, వాహనాల పార్కింగ్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపడతారు.

# రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌దే అధికారం



ప్రజలకు స్కీంలను వివరిస్తున్న వాహిద్ తదితరులు

మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాహిద్

బంట్వారం: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడం ఖాయమని ఆ పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.వాహిద్ ధీమా వ్యక్తం చేశారు. గురువారం కోట్‌పల్లి మండలంలోని రాంపూర్, జిన్నారం గ్రామాల్లో ఇంటింటికి గ్యారంటీ స్కీంలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మేనిఫెస్టోలోని పథకాలను అమలు చేస్తామన్నారు. మాయమాటల కేసీఆర్‌ను నమ్మి మరోసారి మోసపోవద్దన్నారు. కాంగ్రెస్ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులు తప్పా సీఎం కేసీఆర్ కొత్తగా ఒరగబెట్టిందీ ఏమీ లేదన్నారు. వికారాబాద్ నియోజకవర్గం ప్రజలంతా ప్రసాద్‌కుమార్‌కు అండగా నిలుస్తున్నారని, ఎక్కడికి వెళ్లిన బ్రహ్మరథం పడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బార్వాద్ ఎంపీటీసీ నర్సింహరెడ్డి ,నాయకులు మహేశ్వర్‌రెడ్డి , రాజేశ్వర్‌రెడ్డి, మాధవ్, అక్బర్ పాల్గొన్నారు.

### బాలుడి అదృశ్యం



రాఘవేందర్ (ఫైల్)

దోమ : బాలుడు అదృశ్యమైన ఘటన దోమ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ రవిగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని మల్లేపల్లికి చెందిన పద్మమ్మ, నర్సింహులు దంపతుల కుమారుడు రాఘవేందర్ (14), మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌లో 8వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం ఇంటికి వచ్చిన బాలుడు సోమవారం తిరిగి హాస్టల్‌కు వెళ్లాడు. ఎప్పటిలాగే తోటి విద్యార్థులతో కలిసి పరీక్ష రాశాడు. పెట్టే తాళం మర్చిపోయాను అని తోటి విద్యార్థులకు చెప్పి మళ్లీ ఇంటికి బయల్దేరాడు. తిరిగి హాస్టల్‌కు రాకపోవడంతో విద్యార్థులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. తల్లిదండ్రులు బంధువులు, ఇతర ప్రాంతాల్లో వెతికిన ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

### చెరువులో పడి వృద్ధుడి మృతి

షాబాద్: ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ వృద్ధుడు మృతి చెందాడు. ఈ ఘటన షాబాద్ మండలంలోని నాగర్‌కుంట గ్రామ శివారులో గురువారం చోటుచేసుకుంది. షాబాద్ ఎస్‌ఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... నాగర్‌కుంట గ్రామానికి చెందిన వడ్డే అంజప్ప (70) చెరువులో పడి మృతి చెందాడు. గురువారం ఉదయం చెరువులో మృతదేహం ఉన్నట్లు గ్రామస్తులు పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనాస్థలికి వెళ్లి పరిశీలించిన పోలీసులు గ్రామానికి చెందిన అంజప్పగా గుర్తించారు. ఈనెల 9న ఉదయం ఇంట్లో చెప్ప కుండా వెళ్లిపోవడంతో స్థానికంగా, బంధువుల వద్ద ఎంత వెతికినా అతడి ఆచూకీ దొరకలేదని కుటుంబసభ్యులు చెప్పారు. తన తండ్రికి కళ్లు సరిగ్గా కనిపించపోవడంతో ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెంది ఉండవచ్చని కొడుకు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### టిప్పర్ సీజ్

తలకొండపల్లి: అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తున్న టిప్పర్‌ను పోలీసులు సీజ్ చేశారు. ఎస్‌ఐ శ్రీను చెప్పిన వివరాల ప్రకారం.. గురువారం మండల పరిధిలోని వెంకటాపూర్ గేటు వద్ద ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను పోలీసులు పట్టుకున్నారు. డ్రైవర్ మల్లేశ్, యజమాని శంకర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు. టిప్పర్‌ను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

# ఏటీఎంలో చోరీకి విఫలయత్నం



విరిగిపడ్డ ఏటీఎం మిషన్



దొంగతనానికి ప్రయత్నించిన నిందితుడు శ్రీనివాస్

పోలీసుల అదుపులో నిందితుడు

కుల్కచర్ల: మద్యం సేవించిన ఓ యువకుడు పట్టపగలే ఏటీఎం చోరీకి యత్నించిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. కుల్కచర్ల మండలం ఘనపూర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్ (22) కుల్కచర్ల ప్రధాన చౌరస్తాలో ఉన్న ఇండియా1 ఏటీఎం దగ్గర డబ్బులు తీస్తున్నట్లుగా ప్రయత్నించాడు. కొద్దిసేపు తర్వాత ఏటీఎం మరమ్మతులు నిర్వహిస్తున్నట్లుగా ఏటీఎం షట్టర్‌ను సగభాగం వరకు మూసేశాడు. స్క్రూ డ్రైవర్‌తో డబ్బుల భాగాన్ని బయటకు తీస్తున్న క్రమంలో స్క్రీన్ భాగం ఒక్కసారిగా కిందపడి పెద్ద శబ్దం వచ్చింది. దీంతో బయట ఉన్న ప్రజలకు అనుమానం వచ్చి చూడగా ఏటీఎం విరిగిపడిపోవడం చూసి అతడిని పట్టుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనాస్థలిని పరిశీలించి నిందితుడిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

# బాలికపై అత్యాచార యత్నం

పెద్దేముల్: మానసిక వైకల్యం కలిగిన బాలికపై ఓ వృద్ధుడు అత్యాచార యత్నానికి పాల్పడిన ఘటన పెద్దేముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై కాశీనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దేముల్ మండలం తట్టెపల్లికి చెందిన 12 ఏళ్ల బాలిక అంగవైకల్యంతో పాటు మానసిక వైకల్యం కలిగి ఉంది. గురువారం అదే గ్రామానికి చెందిన బాబ్యానాయక్ అనే వృద్ధుడు బాలిక వద్దకు వెళ్లి డబ్బులు ఇస్తానని ఆశ చూపి ఇంటికి తీసుకెళ్లాడు. గమనించిన అదే గ్రామానికి చెందిన వ్యక్తి బాలిక సోదరుడికి సమాచారం ఇచ్చాడు. వెంటనే బాలుడు బాబ్యానాయక్ ఇంటికి వెళ్లి అక్క ఎక్కడ ఉందని ప్రశ్నించాడు. ఇంట్లో లేదని బాలుడిని తిప్పి పంపించాడు. భయపడిన వృద్ధుడు బాలికను ఇంట్లో నుంచి పంపించాడు. బాలిక ఇంటికి వెళ్లడంతో తల్లి సైగలు చేస్తూ అడిగింది. బాలిక బాబ్యానాయక్ ఎం చేశాడనేది సైగల ద్వారా తల్లికి వివరించింది. దీంతో తల్లి అతనిపై పెద్దేముల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

# పట్టపగలే దొంగల హల్‌చల్

- రెండు ఇళ్లలో చోరీ
- నగదు, బంగారం అపహరణ

శంకర్‌పల్లి: శంకర్‌పల్లి పట్టణ కేంద్రంలో పట్టపగలే దొంగలు స్వైర విహారం చేశారు. వేర్వేరు కాలనీల్లో రెండు ఇళ్లల్లో చోరీకి పాల్పడ్డారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని 7వ వార్డులో పిల్లగుండ్ల రాజు ఇంట్లో వెంకటయ్య అనే ఉపాధ్యాయుడు కిరాయికి ఉంటున్నారు. వెంకటయ్య భార్య కూడా ఉపాధ్యాయురాలే. వీరిద్దరూ రోజు మాదిరిగా విధులకు వెళ్లారు. అయితే గురువారం మధ్యాహ్నం ఎవరూ లేని సమయంలో దొంగలు తాళం పగులగొట్టి.. ఇంట్లో ఉన్న 2 తులాల బంగారం, 15తులాల వెండి, రూ.10వేలు నగదు, రెండు సెల్ ఫోన్‌లు, రెండు స్మార్ట్ వాచ్‌లను ఎత్తుకుపోయారని బాధితులు తెలిపారు. అదేవిధంగా 14వ వార్డులోని శ్రీరాం నగర్ కాలనీలో బద్దం రాఘవేందర్ ఇంట్లో అద్దెకు ఉంటున్న వంశీ, అతని భార్య ప్రైవేట్ ఉపాధ్యాయులు. భార్యాభర్తలిద్దరూ పని నిమిత్తం బయటకు వెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చే చూడగా.. 15తులాల బంగారు నగలు, రూ.లక్ష 40వేల నగదును అపహరించుకొని పోయారని బాధితులు పేర్కొన్నారు. చోరీ జరిగిన విషయం పోలీసులకు తెలియడంతో శంకర్‌పల్లి డిటెక్టివ్ సీఐ నాగరాజు, డిటెక్టివ్ ఎస్‌ఐ సత్యనారాయణ ఘటన స్థలానికి చేరుకొని, క్లూస్ టీంను రప్పించి ఆనవాళ్లను, వేలి ముద్రలను సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# ఆయిల్ పామ్ సాగుకు చేయూత

- బీసీ, ఓసీ రైతులకు 90 శాతం సబ్సిడీ
- ఎస్సీ, ఎస్టీలకు వందశాతం
- రైతులను ప్రోత్సహించేందుకు ప్రతి ఏడాది రూ. 4,200



ఆయిల్ ఫాం చెట్టు (ఫైల్)

మంచాల: ఆయిల్ పామ్ పంట సాగుకు ప్రభుత్వం చేయూతనందిస్తోందని మండల వ్యవసాయాధికారి జ్యోతి తెలిపారు. గురువారం మంచాలలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ మూస పద్ధతిలో పంటలు సాగు చేసి నష్టపోవద్దని రైతులకు సూచించారు. నూతన విధానాలతో మార్కెటింగ్‌లో మంచి లాభాలు పొందే విధంగా కృషి చేయాలన్నారు. బీసీ, ఓసీ రైతులకు ప్రభుత్వం 90 శాతం సబ్సిడీతో పాటు డ్రిప్ సౌకర్యం కల్పిస్తుందని పేర్కొన్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీలకు వంద శాతం సబ్సిడీ ఇస్తోందని తెలిపారు. రైతులను ప్రోత్సహించేందుకు ప్రతి ఏడాది ఎకరాకు రూ.4,200 వారి అకౌంట్‌లో ప్రభుత్వం జమ చేస్తోందని చెప్పారు. ఇలా నాలుగేళ్ల ప్రోత్సాహకం అందిస్తారని వివరించారు. నాలుగేళ్ల తర్వాత పంట దిగుబడి మొదలై.. 30 సంవత్సరాల వరకు వస్తుందన్నారు.

# మద్యం కోసం సోదరుడి హత్య

పోలీసుల అదుపులో నిందితుడు

కొందుర్గు: మద్యానికి బానిసైన సొంత అన్ననే హత్య చేసిన ఘటన గురువారం కొందుర్గులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొందుర్గుకు చెందిన బోయ మల్లమ్మ, కృష్ణయ్య దంపతులకు నవీన్(25), నరేశ్ (23) కుమారులు. నవీన్ సెంట్రింగ్ పని చేస్తుండగా.. నరేశ్ ట్రాక్టర్ డ్రైవర్. అయితే కుటుంబ అవసరాలు కోసం పది గుంటల భూమిని అమ్మారు. అప్పటి నుంచి నరేశ్ తరుచుగా మద్యం తాగుతూ, జులాయిగా తిరుగుతున్నాడు. ఈ క్రమంలో మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వాలని నరేశ్ తన సోదరుడితో తరచూ గొడవకు దిగేవాడు. అన్న డబ్బులు ఇవ్వకపోవడంతో కక్ష పెంచుకున్న తమ్ముడు.. బుధవారం రాత్రి నవీన్ నిద్రిస్తున్న సమయంలో ఇనుప వైర్‌ను మెడకు బిగించి హత్య చేశాడు. గురువారం నవీన్ మృతి చెందిన విషయాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. షాద్‌నగర్ రూరల్ సీఐ లక్ష్మీరెడ్డి, ఎస్‌ఐ కృష్ణయ్య ఘటన స్థలాన్ని పరిశీలించారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. తల్లి మల్లమ్మ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుతున్నామని సీఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు.